# నిచ్చెన తన్నేసిన నిజం

నిర్మలమైన ఆకాశం, అందమైన సూర్యరశ్మి, గదిలో చల్లగాలి– మంచి కాఫీత్రాగి పత్రిక చూస్తే, మనస్సు ఎలాగో అయింది. ఆఫ్రికాలో కల్లోల రాజకీయ పరిస్థితి ఫలితంగా రెండువందలమంది హతులయ్యారు. మరో దేశంలో గనిప్రేలి అరవైమంది చనిపోయారు. ఎక్కడో విమానం తగులబడి నలభై యాత్రీకులు మరణించారు. మరొకచోట రైలుపట్టాల మీద నుండి తొలిగింది, పడవ మునిగింది, భూకంపం, అగ్నిపర్వతం ప్రేల్పుడు, వరద, అడవి కాలింది. ఆ ఉదయం పత్రికంతా ఇదే గొడవ. ఇవేవీ నే వున్న చోటుకి ఐదారువందలమైళ్ళ అవతల జరిగినవేకాని, దగ్గరలో జరిగినవికావు. నేనేమీ కంగారుపడవలసిన పనిలేదు. అయినా ఉల్లాసం సన్నగిలి, దిగులు ఆవరించింది. ఆఫ్రికాలో రెండువందలమంది హతులయ్యారన్నది అచ్చులోనొక వాక్యం : 'రెండువందలు' ఒక సంఖ్య. కళ్ళ ద్వారా మెదడుకు చేరుతుంది యీ వాక్యం. ఆ మెదడు శరీరం అంతటా కొన్ని సందేశాలు పంపుతుంది. అందులో కొన్ని ఊహని కదుపుతాయి. ఆ ఊహ జ్ఞాపకం వున్న వాటిని క్రోడీకరించి ఒక దృశ్యంగా మెదడులోకి పంపుతుంది. ఆ రెండువందలమందీ ఎవరు? వాళ్ళకిపేర్లు పెట్టాలి. రంగు నలుపు, ఎత్తు, బరువు, జన్మస్థానం, పుట్టుకతేదీ, వృత్తి వ్యాపారం, వారి భార్యలు, పిల్లలు, సంసారం, ఆస్తిపాస్తులు, బ్యాంక్ ఎకౌంట్లు, నగలు, ఇళ్ళు ఖాళీ అవుతాయా? భార్య, పిల్లలు ఎక్కడుంటారు? ఏంచేస్తారు? వారెలా చంపబడ్డారు? చంపినవారికి విచారణ, శిక్ష వున్నయ్యా? భూగోళం పటం చూడు, వారిదేశం రాజ్యాంగం ఎట్టిది? వారికి మద్దత్తయ్యే దేశాలేవి? అంతర్జాతీయ సమితి ఏంచేస్తోంది ? దానిపట్ల భారతదేశం దృక్పథం ఎలాంటిది? ఇంక, భారతీయుడుగా నా కర్తవ్యం ఏమిటి? ఊహ అలా లోకం అంతటా తిరిగి తిరిగి, మళ్ళా కుర్చీ నాలుగుకాళ్ళమధ్య కుదింపై పోతుంది. అందుకే గాంధీగారు "రోజుకొక వార్తచాలు, ఊహించి బాధపడటానికి, బోలెడు వద్దు" అనేవారు.

దీని ఫలితం? ఊహని రేకెత్తించడంలో నరాల ఒత్తిడి, అలసట, దాన్నుండి వుద్భవించిన దిగులు మనస్సు ఎలాగో అవడం. లోకం అంతా ఒకటే, మానవజాతి అంతా ఒక్కటే అన్నదానికి ప్రత్యక్ష సాక్ష్యం యీ దిగులనుకుని సమాధానపడాలి. ఈ అంతర్జాతీయభావం ఊహలోనిచ్చెన. నాకంటె బలహీనులైతే నిచ్చెన దిగి వారి భుజాలు చరుస్తాను. నాకంటె బలవంతులైతే నిచ్చెన ఎక్కి చేతులు జోడిస్తాను. మరి కాకపోతే, అలా ఊహలో వాక్యాలు నిల్చిపోడానికి కారణం, రెడ్డిరాక. రెడ్డి ఆయాసం తీర్చుకుంటున్నాడు. 'విన్నావా?' అంటున్నాడు. కూర్చోమన్నాను. కాఫీ తీసుకోమన్నాను.

"విన్నావా?"

"ఏమిటి కథ? నిదానంగా చెప్పు, ఆయాసపడకు."

"లక్ష్మీపతి నెరుగుదువుగా...."

"చెప్పు."

"రోడ్డుమీద పడిపోయాడు. హతోస్మి."

"ఆ!"

"జనం మూగేశారు. రకరకాలుగా చెప్పుకుంటున్నారు."

"ఏమని?"

"హత్యచేశారట."
దాంతో లేచి నిలబడ్డాను.
"ఎక్కడ?"
"సినిమాహాలు ముందు వీధిలో, నడివీధిలో, పట్టపగలు."
రెడ్డి తొందరగా వెళ్ళిపోతున్నాడు.
"ఉండునేనూవస్తాను."
నేనూ బైలుదేరాను. రెడ్డి వేగంగా వెళ్ళిపోయాడు.
నిజానికి నేను లక్ష్మీపతిని బాగా ఎరుగను. ఓ విధంగా ఆఫ్రికాలో హతులైన రెండువందలమందిలో ఒకడైన ప్రభావం మాత్రం నాపై పడిందనొచ్చు. వెనక చాలా కాలంక్రితం మా మామయ్యవద్ద గుమస్తాగా పనిచేసేవాడు. లక్ష్మీపతి పీలగా, నల్లగా వుండేవాడు. ఖద్దరులాల్చీ, పైజామా, పైన కండువా ధరించేవాడు. రాత్రిళ్ళు పేకాట ఆడేవారు. నమ్రత చూపేవాడు. మామయ్య పన్లు చేసిపెట్టేవాడు. అదే నా జ్ఞాపకం.
రెండు ఫర్లాంగులు నడిచాక, సత్తెన్న తటస్థపడ్డాడు. ఒగర్చుకుంటూ వచ్చి నిలబడ్డాడు.
"విన్నావా? లక్ష్మీపతి పడిపోయాడుట. వింతగా చెప్పుకుంటున్నారు.
"అవును. రెడ్డి చెప్పాడు. వస్తుంటే వుండకుండా వెళ్ళాడు. పద వెడదాం."
"ఏం చెప్పాడు రెడ్డి?" అన్నాడు సత్తెన్న.
సత్తెన్న, రెడ్డి ఒకవూరివారే. మొదటినుండి ఇద్దరికీ పడదు. ఎందుకో మరి.
"హత్యచేశారుట."
"వాడిమొహం. అదేంకాదుట. ఆత్మహత్య యత్నంట."
"ఆ !"
"ఏంచేస్తాడు! భార్య రంభ, తను కోతి. ఆమె చిన్నది. తను యాభయ్యోపడిలో పడ్డాడు. తెలుసుగా! రెండోపెళ్ళి."
నడుస్తున్నాం. "అవును జ్ఞప్తికొచ్చింది. ఆ రోజుల్లో లక్ష్మీపతిభార్య చాలా చక్కనిదని చెప్పుకునేవారు. లక్ష్మీపతికి అప్పుడు నలభైలోపు. మొదటిభార్య ద్వారా సంతానం వున్నారు. ఎందరో నాకు తెలియదు. భార్యకి ఇరవై. వివాహం గొప్పగా జరిగిందట. అంటే, ఆమెని చూడ్డానికి జనం ఎక్కడెక్కడనుంచో ఎగబడ్డారుట. భర్త అందంగా లేకపోవడం, ఈడు కాకపోవడం జనానికి మరో ఆకర్షణా అనిపిస్తుంది. ఏమో, నేను చూడలేదు ఆ పెండ్లి, అయితేమాత్రం వివాహమైన పదేళ్ళకి ఆత్మహత్య తలపెట్టడం దేనికో?" సత్తెన్నని ఈ ప్రశ్న అడిగాను, ఒగురుస్తూనే, నవ్వుతున్నాడు.
"అంతా వుందిలే. ఆమె తనతో సరిగ్గా వుండటంలేదుగా, తను ఆమెను విడువలేడు. ఆమె లేకుంటే పిల్లలు బ్రతకరుట; ఉంటే పిల్లలు చెడిపోతారుట. ఆమె అలాంటిది."
"నువ్వెరుగుదువా?"
"ఎరగనుస్మా?"
"హత్య ఎందుకు కాకూడదు?"
"లక్ష్మీపతి మంచివాడు. మెత్తటివాడు. ఎవ్వరితోనూ తగవులాడడు. శత్రువులు లేరు."

"తనకి తనే శత్రువంటావు?"

తలపంకించాడు. తొందరగా వెళ్ళిపోతున్నాడు. ఉండు, నేనూ వస్తున్నానన్నాను. వినిపించుకోలేదు. వేగంగా వెడుతున్నాడు సత్తెన్న. చిత్రం, తను విన్నది ఎవరితోనో చెప్పుకోవాలి. నే కనిపించాను. చెప్పుకోడం అవగానే నేనక్కర్లేదు.

నేనూ కొంచం తొందరగా నడవడం సాగించాను. మరో మూడు ఫర్లాంగులు వుంది. చుట్టుప్రక్కల బండి వుందేమోనని చూస్తూ నడుస్తుంటే, పరుగెత్తుకుంటూ వచ్చాడు రాఘవయ్య. రాఘవయ్యని చిన్నప్పుడెరుగుదును. మళ్ళా యీ మధ్యనే అతని పరిచయం జరిగింది. లక్ష్మీపతితో కలిసి, మా మామయ్య దగ్గర పనిచేసే గుమస్తాలలో ఒకడు. లక్ష్మీపతిని బాగా ఎరుగున్న వాడే అనుకుంటాను.

"లక్ష్మీపతి హారి అనుకున్నంతా చేశాడు" అన్నాడు రాఘవయ్య.

"ఆత్మహత్యటగా."

"ఛ, ఛ."

"మరి?"

"లారీకింద పడ్డాడుట. ఈ లారీలవాళ్ళ నెవరాపగలరు? సగం ప్రమాదాలు లారీ ప్రమాదాలే."

"హత్యని విన్నాను. ఆత్మహత్యనీ విన్నాను. ప్రమాదం అంటావు నువ్వు."

"నిస్సందేహంగానూ. ప్రమాదాలు నీకూ నాకూ జరగవు. అవి కొందరికే లక్ష్మీపతిలాంటి వాళ్ళకి జరుగుతాయి. వారు ప్రమాదాన్ని అన్వేషిస్తారు, దానికోసం అవతారం దాల్చినట్లు" అవును. ఈ సిద్ధాంతం ఎక్కడో చదివాను. ప్రమాదాలు కొందరికే జరుగుతాయనీ పుట్టుకతోనే అట్టివారి మనస్తత్వం, శరీరపు ఆకృతి ఏర్పడి వుంటుందనీ, ఒకవిధంగా అలాంటివారు ప్రమాదాలను ఆశిస్తారనీ ఇదంతా మానసిక శాస్త్రానికి సంబంధించిన సిద్ధాంతం. లక్ష్మీపతి దేనికిందోపడి తనువు చాలించడానికి తనకి జిజ్ఞాస లేకుండా, అంతరంగంలో కాంక్షించాడా? అయితే, దానికి కారణం?

"అవును కళ్ళు నెత్తిన పెట్టుకు తిరిగితే, ప్రమాదం ఎందుకు జరగదు? ప్రతివాడూ, వాడి కార్యాలకి ఫలితం ఇక్కడే అనుభవించి తీరుతాడనుకో" అన్నాడు రాఘవయ్య.

"అంటే కళ్ళు నెత్తిమీదికి ఎందుకు వెళ్ళాయో!"

"వెళ్ళవూ, ఒక్కసారి ముప్పై వేలొచ్చిపడితే, నీకు తెలీదా?"

తెలియదన్నట్లు తల పంకించి, ఆశ్చర్యం ప్రకటించాను.

"ఆ మధ్య సర్టిఫికెట్లు ఏవో కొన్నాడులే. 'డ్రా' అంటారే– ఆ డ్రాలో ముప్పై వేలొచ్చింది. ఉద్యోగం విడిచేశాడు. బిజినెస్ పెట్టాడు. పైలాపచ్చీస్‌లా నడుస్తోందిట బిజినెస్. కళ్ళు నెత్తిమీదే. ఏ కారు కొందామా అని కార్లంట చూస్తూ నడిస్తే లారీకింద పడేసి నలిపెయ్యదూ!"

ఇదొక సిద్ధాంతం, రాఘవయ్యది. లక్ష్మీపతిపట్ల సానుభూతి లోపించింది యిందులో. ఇతనికేదో లక్ష్మీపతంటే కసున్నట్లు తోచింది. నిజానికి ఈ వార్త నా చెవిని పడేస్తూ వచ్చిన సత్తెన్న, రెడ్డి, రాఘవయ్య ధోరణుల్లో కుతూహలం వుంధికాని, సానుభూతి లేదేమో. రాఘవయ్య వెళ్ళిపోయాడు. నాతో రమ్మన్నాను. ఏదో తొందర పనుందన్నాడు.

ఇంకా కొంచెం వేగంగా నడవడం సాగించాను. నాకు లక్ష్మీపతి పట్ల

సానుభూతుందా? అందర్లాగే చోద్యం చూద్దామని వెళ్ళడమేగా, దగ్గరలో జరుగుతుంది కదా అని! వచ్చేశాను. అదిగో సినిమాహాలు. మలుపు తిరిగాను. పెద్ద వీధిలో చేరుకున్నాను. పరుగెత్తుకుంటూ వచ్చాడు సత్తెన్న.

"మరేం లేదు, లక్ష్మీపతి జారిపడ్డాడుట. దెబ్బలు తగల్లేదు" అని చెప్పి వెళ్ళాడు.

గుంపు దగ్గరకు వెళ్ళాను. గుంపు పల్చబడింది. ఓ పదిమంది వుంటారేమో, అంతా నిలబడే వున్నారు. లక్ష్మీపతిని చూశాను. పెద్ద వాడయ్యాడు. వెంటనే గుర్తుపట్టలేకపోయాను. ఎన్నేళ్ళయిందో చూచి, గడ్డం పెరిగింది. పంచికట్టు, కోటు, కొత్త ఆకుజోళ్ళు, వెడల్పు ఫ్రేమ్ కండ్లజోడు, నెత్తిమీదికి జరిగి ఎగదువ్విన క్రాపింగ్, జనం ఎవరిదోవని వారు వెడుతున్నారు.

"లక్ష్మీపతిగారు అవునా?"

దిగాలుగా నవ్వి, "ఎలా వున్నారు, ఏమిటి కథ" అని పరామర్శించాడు.

"క్షేమం కదా! ఏమిటి పడిపోయారట, గాయాలు."

"అవును. అరటిపండు తొక్కమీద మరి......." అన్నాడు.

"ఎక్కడ ? ఏది?"

"నాక్కాదు."

"మరి?"

కాళ్ళకేసి చూశాను. కుంటడంలేదు, దుస్తులమీద రక్తంబొట్టు లేదు. చేతులు, మొహం, క్రాపింగ్ దుమ్మువలేదు, చెరగలేదు.

"ఏమిటి, అలా చెప్పారు. ప్రమాదం జరిగిందనీ, ఘోరం జరిగిందనీ...."

"ఓ, అదా! రా, చెప్తాను."

మెల్లగా నడుస్తున్నాం. మా చుట్టూవున్న ముగ్గురిలో ఇద్దరు కదిలారు. మూడో ఆయనకేసి చూపించాడు లక్ష్మీపతి.

"అతనే అరటితొక్కమీద కాలుజారి పడ్డాడు. రోడ్డుమీద, కుడివైపు పడబోతుంటే ఎడంవైపుకి నెట్టాను. పడ్డాడు. కుడివైపునుండి లారీ వెళ్ళింది. అంగుళంలో ప్రమాదం తప్పింది. లేకుంటే లారీకిందపడి చచ్చేవాడే."

"అయితే పేచీ ఏమిటి?"

"నేను నెట్టడంవల్ల పడి, రాయి తగిలి గాయపడ్డాడుట. దెబ్బలకి కారణం నేనుట. లారీ నిల్చింది. నేను నెట్టకుంటే దానికింద పడేవాడు. అందుకు కృతజ్ఞత లేదు. గాయం కూడా మహా ఏమీలేదు. కాస్త నుదురు గీసుకుపోయి తుంపరా ఎర్రబడింది. అంతే, నలుగురూ మూగారు. పోలీసులు, ఆరాలు, ప్రశ్నలు, ఫిర్యాదులు. చివరికి ఏమీలేదు. ఎవరిదార్ని వారు పోయారు. లారీవాడు మాత్రం పాపం, కృతజ్ఞత చెప్పుకున్నాడు. నేను ఆ వ్యక్తిని తొయ్యకపోతే తన లారీ క్రిందపడి, పెద్ద ప్రమాదం జరిగేది. అది లేకుండా చేసినందుకు మెచ్చుకున్నాడు."

మెల్లగా నడుస్తున్నాం.

"ఇంతకీ మీకేమీ జరగలేదన్నమాట."

"చెప్పానుగా."

"హత్యన్నారు, ఆత్మహత్యన్నారు....ఏవేవో."

నవ్వాడు లక్ష్మీపతి.

"అలాగే. పాపం, వారి కోరికలు ఫలించలేదు. నేను మళ్ళా పెళ్ళి చేసుకోడం వాళ్ళకి బాధ. భార్య లేచిపోలేదు, హాయిగా నాతోనే వుంది. పైపెచ్చు అకారణంగా ముప్పైవేలొచ్చి పడడం మరో బాధ. వచ్చినప్పుడు ఎంతగా ప్రశంసించి, అభినందించా రనుకొన్నావు. పార్టీలకే అయింది రెండు మూడొందలు. ఆ ముప్పై వేలు కూడా మాయమైతే, నేను చిరకాలం వర్ధిల్లాలని దీవించడానికి వారికి అభ్యంతరం ఉండదు. ఇది ప్రజాస్వామ్యం. అందరికీ సమంగా ఉండాలి అన్నీ."

ఆ చివరమాటతో లక్ష్మీపతి సన్నిహితుడయ్యాడు నాకు. తోటి మనుషుల్ని నా సమాజాన్ని బాగా అర్థం చేసుకొనే అవకాశం ఇచ్చిన లక్ష్మీపతి, ముఖ్య స్నేహితులలో ఒకడుగా పరిగణించి, చిరకాలం వర్ధిల్లాలని కోరుతో ఇంటికొచ్చే పత్రిక చూస్తే ఇతర దేశాలలో హతులైన వారంతా మిత్రులేనన్న నమ్మకం- దానితో వచ్చేబాధ ప్రస్ఫుటమై వూహలో వేసిన నిచ్చెనని, నిజం తన్నేసింది.

* * *